PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
తెలంగాణ గురువారం 01-10-2026 సంపుటి: 01 సంచిక : 263 పేజీలు : 12

# రెండు సీట్లూ రెడ్లకేనా..?

ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్!.
జానారెడ్డి కుట్ర అంటూ సంచలన ఆరోపణలు.
"బీసీలకు టికెట్ ఇవ్వాలంటేనే కాంగ్రెస్‌లో ఆశ్చర్యం".
రెండు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను బరిలోకి దింపుతాం: మల్లన్న.



2

# సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయం!

సిరుల గనిని స్కాముల గనిగా మార్చారు.
రాష్ట్ర ప్రభుత్వంపై బాల్క సుమన్ ధ్వజం.



2

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 30:**

తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. సింగరేణిలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 51 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బాల్క సుమన్ ఆరోపించారు. సింగరేణిని అవినీతికి అడ్డాగా మార్చారని విమర్శించారు.

# కేటీఆర్‌కు అంత అహంకారం ఎందుకు..?

అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?
సిరిసిల్ల సభలో కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు.
ప్రభుత్వ ఉద్యోగులే పేదలకు కీలక ప్రతినిధులు.
పేదవాడికి ప్రభుత్వ కార్యాలయం నమ్మకంగా ఉండాలి.
కరీంనగర్‌కు రూ.944 కోట్ల అభివృద్ధి వరాలు.
కేంద్రంతో కలిసి తెలంగాణ అభివృద్ధి.. సీఎం స్పష్టం.
కంటోన్మెంట్‌కు చెక్.. రూ.5 వేల కోట్ల ఎలివేటెడ్ కారిడార్.
కేటీఆర్‌కు అంత అహంకారం ఎందుకు..?.
సిరిసిల్లను సిరుల సీమగా మార్చారా..
ఊరిసిల్లగా చేశారా..?.
172 ఓట్లతో గెలిచి.. ఇన్ని కోట్లు ఎలా వచ్చాయ్..?
హామీలు ఎన్నో.. అమలు చేసినవి ఎన్ని..?
సిరిసిల్ల వేదికగా బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ సమరశంఖం.



**జనం వాయిస్, కరీంనగర్, సిరిసిల్ల, సెప్టెంబర్ 30:**

సిరిసిల్ల అంటే సిరులకు నిలయంగా ఉండాల్సిందిపోయి గత బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలతో 'ఊరిసిల్ల'గా మారిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆస్తులు కూడబెట్టుకున్నారంటూ ఆరోపణలు చేశారు. 2009 ఎన్నికల్లో కేవలం 172 ఓట్ల తేడాతో కేటీఆర్ గెలిచారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ తర్వాత అధికారాన్ని అడ్డుపెట్టుకుని భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. అమెరికాలో అంట్లు తోమిన వ్యక్తికి, హోటళ్లలో చిప్పలు కడిగిన వ్యక్తికి ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి ముఖ్యమంత్రి చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత వ్యక్తుల వివరణలు లేదా ఆధారాలు వేరుగా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొనవచ్చు. కరీంనగర్ జిల్లాలో సుమారు రూ.944 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర సహకారంతో రూ.840 కోట్ల నిధులు సాధించామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. -

మిగతా 2 లో...





## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు.

సీఎం రేవంత్ రెడ్డి అభినందన.
రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంస.
ఈ విజయంతో 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికిత.
పెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికిత.



2

## నా పాస్‌పోర్ట్‌ను మోదీ, అమిత్ షా అడ్డుకుంటున్నారా? : కేఏ పాల్

వాషింగ్టన్ నుంచి కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు.
పాస్‌పోర్ట్ రెన్యువల్ ఆలస్యంపై మోదీ సర్కారుకు కేఏ పాల్ ప్రశ్న.
తన నోరు విప్పితే ఇబ్బందులు తప్పవని హెచ్చరిక.



2

## శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం.

టేకాఫ్ అయిన కొద్దిసేపటికే వెనక్కి
సురక్షితంగా బయటపడ్డ 45 మంది ప్రయాణికులు.
విజయవాడ వెళ్తున్న విమానంలో సాంకేతిక లోపం.
టేకాఫ్ అయిన వెంటనే గుర్తించిన పైలట్.

## వీల్ చైర్‌పై తల్లిని తోసుకుంటూ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన యువకుడు.. ఎందుకంటే?

ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఆగ్రహం.
తల్లిని వీల్?చైర్‌పై ఎమ్మెల్యే ఇంటికి తీసుకెళ్లిన కొడుకు.
మంచిర్యాల జిల్లా ఆసుపత్రిలో 5 గంటలపాటు చికిత్స అందించలేదని ఆరోపణ.
అర్ధరాత్రి 2 కిలోమీటర్ల దూరం వీల్ చైర్‌పై తల్లిని తోసుకుంటూ వెళ్లిన యువకుడు.
ఎమ్మెల్యే సిబ్బంది జోక్యంతో స్పందించిన ఆసుపత్రి అధికారులు.



2

## సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టేశారు!

కార్మికుల హామీలు అమలు చేసి లాభాల వాటా ప్రకటించాలి: ఈటల రాజేందర్.

3



## రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ.
రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం.
తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న
రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ.



2

# ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 30:**

ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.



# నా పాస్‌పోర్ట్‌ను మోదీ, అమిత్ షా అడ్డుకుంటున్నారా?: కేఏ పాల్

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 30:**

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై సంచలన ఆరోపణలు చేశారు. తన పాస్‌పోర్ట్ రెన్యువల్ చేయవద్దని వారేమైనా ఆదేశాలు జారీ చేశారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం ముందు నిలబడి రికార్డ్ చేసిన ఒక వీడియోలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మూడు నెలల క్రితం పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నా, ఇప్పటికీ రాకపోవడం షాక్‌కు గురిచేసిందని పాల్ తెలిపారు. మోదీ, అమిత్ షా తనకు మంచి మిత్రులని చెబుతూనే, ఈ జాప్యం వెనుక వారి ఆదేశాలు ఉన్నాయా? లేక విదేశాంగ మంత్రి జైశంకర్ ఏమైనా చెప్పారా? అని అనుమానం వ్యక్తం చేశారు. తాను భారత్‌కు వస్తున్నాననే కారణంతో గానీ, ఎఫ్‌సీఆర్‌ఏ సమస్యల వల్ల గానీ తన పాస్‌పోర్ట్‌ను అడ్డుకుంటున్నారా? అని ఆయన నిలదీశారు. 2024 ఎన్నికల ప్రచారం సందర్భంగా విజయనగరంలో తనపై నమోదైన కేసును కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ ఘటనలో ఒక యువకుడు చనిపోతే, నిరసన చేస్తున్న వారిని తాను సముదాయించి పంపించానని, మంచి పని చేసినా తనపై కేసు పెట్టారని పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కేసు ఇంకా కొట్టివేయలేదని, దాని కారణంగానే పాస్‌పోర్ట్ నిలిపివేశారా? అని ప్రశ్నించారు. ఈ 'చిన్న' విషయంపై తాను ఎక్కువగా మాట్లాడదలచుకోలేదని, తాను నోరు విప్పితే అనవసర సమస్యలు వస్తాయని మోదీ, అమిత్ షాలను హెచ్చరించారు. న్యాయపరమైన చర్యలు తీసుకునేలోపే తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం.

**జనం వాయిస్, సెప్టెంబర్ 30:**

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడకు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ దానిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ హఠాత్పరిణామంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. 591 ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 45 మంది ప్రయాణికులతో శంషాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. విమానం గగనతలానికి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. వారి అనుమతితో విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానం క్షేమంగా ల్యాండ్ అవ్వడంతో అటు ప్రయాణికులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని విమానాశ్రయ వర్గాలు ధ్రువీకరించాయి. అనంతరం సాంకేతిక బృందం విమానాన్ని తనిఖీ చేసి మరమ్మతులు ప్రారంభించింది. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో విజయవాడకు పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ యాజమాన్యం వెల్లడించింది.

# వీల్ చైర్‌పై తల్లిని తోసుకుంటూ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన యువకుడు.. ఎందుకంటే?

**జనం వాయిస్, మంచిర్యాల, సెప్టెంబర్ 30:**

మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై ఓ కుమారుడు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లికి గంటల తరబడి వైద్యం అందడం లేదని ఆరోపిస్తూ, ఆమెను వీల్?చైర్‌పైనే తోసుకుంటూ అర్ధరాత్రి వేళ స్థానిక ఎమ్మెల్యే నివాసానికి తీసుకెళ్లిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన భూక్య రాజ్?కుమార్ తన తల్లి భూక్య బుజ్జి (55)ని మంగళవారం రాత్రి మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆమె ఆరోగ్యం విషమించడంతో అత్యవసర చికిత్స కోసం ఇక్కడికి తీసుకువచ్చారు. అయితే, ఆసుపత్రికి వచ్చిన సుమారు ఐదు గంటల వరకు కనీసం బెడ్ కూడా కేటాయించకుండా, తన తల్లిని వీల్?చైర్‌కే పరిమితం చేశారని రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. చికిత్స అందించాలని ఎంత వేడుకున్నా సిబ్బంది స్పందించలేదని, పైగా దీనిపై ప్రశ్నించినందుకు తనపై దాడికి ప్రయత్నించారని ఆయన ఆరోపించాడు. వైద్యుల తీరుతో తీవ్ర నిరాశకు గురైన రాజ్?కుమార్, దిక్కుతోచని స్థితిలో తన తల్లిని అదే వీల్‌చైర్‌పై సుమారు 2 కిలోమీటర్ల దూరం తోసుకుంటూ అర్ధరాత్రి వేళ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్ రావు నివాసానికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేనప్పటికీ, అక్కడి సిబ్బంది రాజ్?కుమార్‌తో మాట్లాడి వెంటనే ఆసుపత్రి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్న ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీధర్, బాధితురాలికి మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తల్లి, కుమారుడిని తిరిగి ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించారు.



# రెండు సీట్లూ రెడ్లకేనా..?

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 30:**

తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో రాజకీయ వేడి రాజుకుంది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డి, నల్గొండ--ఖమ్మం--వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించడంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం వెనుక రాజకీయ కుట్ర ఉందని మల్లన్న ఆరోపించారు. ఈ వ్యవహారంలో సీనియర్ నేత జానారెడ్డితో పాటు మరో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, మరో రెడ్డి నేత కీలకంగా వ్యవహరించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి తన ఆరోపణలేనని ఆయన స్పష్టం చేశారు. "రెడ్ల పార్టీ రెడ్లకు కాకుండా బీసీలకు టికెట్లు ఇస్తేనే ఆశ్చర్యపడాలి" అంటూ కాంగ్రెస్ టికెట్ల కేటాయింపుపై మల్లన్న తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లోని కొందరు నేతలు ముందస్తు



వ్యూహంతోనే ఈ కేటాయింపులు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కేవలం బలిపశువులు మాత్రమేనని మల్లన్న వ్యాఖ్యానించారు. పార్టీ విజయం కంటే ఒక సామాజిక వర్గం అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కొందరు నేతలు పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్‌లోని ఓ వ్యక్తితో రహస్య ఒప్పందం కుదిరిందంటూ మరో సంచలన ఆరోపణ చేశారు. గతంలో ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్‌కు కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని మల్లన్న గుర్తుచేశారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాతే ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు రాజకీయ గుర్తింపు పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలు రెడ్లు, వెలమలు, బీసీల మధ్య రాజకీయ పోరుగా మారుతున్నాయని మల్లన్న వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీసీ వాదం లేదని నిరూపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. తమ తెలంగాణ రాజ్య అధికార పార్టీ తరఫున రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను బరిలోకి దించి గెలిపిస్తామని మల్లన్న ప్రకటించారు. తన అభ్యర్థిత్వంపై త్వరలోనే స్పష్టత వస్తుందని వెల్లడించారు.

# సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయం!

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 30:**

తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. సింగరేణిలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 51 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బాల్క సుమన్ ఆరోపించారు. సింగరేణిని అవినీతికి అడ్డాగా మార్చారని విమర్శించారు.

## 40 లక్షల టన్నుల బొగ్గు ఎక్కడికి పోయింది?

సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయం కావడంపై సమగ్ర విచారణ జరపాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు. బొగ్గు నిల్వలు, ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తి లెక్కలపై అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. గతంలోనూ బీఆర్‌ఎస్ నేతలు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు వ్యవహారంపై ఆరోపణలు చేశారు; ఈ అంశంపై సుమారు రూ.1,600 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందని వారు పేర్కొన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్‌లో కేవలం 334 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని బాల్క సుమన్ విమర్శించారు. సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటాపైనా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు.

సింగరేణి డబ్బులు ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తున్నారా?

సింగరేణి సంస్థ నిధులను ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తోందని బాల్క సుమన్ ఆరోపించారు. సంస్థ ప్రయోజనాలు, కార్మికుల సంక్షేమం, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టకుండా రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణి వనరులను వినియోగిస్తున్నారని మండిపడ్డారు. సింగరేణిలో అవినీతి ఆరోపణలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

## సింగరేణిని అమ్మితే.. ఉద్యమమే!

సింగరేణి సంస్థను ఎవరికైనా అప్పగించే ప్రయత్నం జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని బాల్క సుమన్ హెచ్చరించారు. "సింగరేణి అంటే సిరుల గని.. దానిని ప్రైవేటు చేతుల్లో పెట్టే కుట్రలను సహించేది లేదు" అని స్పష్టం చేశారు. అక్టోబర్ 5న తెలంగాణ భవన్‌లో సింగరేణి కోల్‌బెల్ట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, కార్మిక సంఘాల నేతలతో కేటీఆర్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## సిరిసిల్లకు ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలి

సిరిసిల్ల అభివృద్ధికి గతంలో కేటీఆర్ చేసిన కృషిని బాల్క సుమన్ ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు ఎన్ని నిధులు కేటాయించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లకు రేవంత్‌రెడ్డి టూరిస్ట్‌లా వస్తున్నారని విమర్శించారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చుట్టూనే రేవంత్‌రెడ్డి రాజకీయాలు తిరుగుతున్నాయని విమర్శించారు.

## తెలంగాణ నీళ్లపై తీవ్ర ఆరోపణలు

తెలంగాణకు రావాల్సిన 45 టీఎంసీల నీటిని అడ్డుకునేందుకు చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాస్తున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. నాన్-బేసిన్ ప్రాంతమైన కుప్పానికి కృష్ణా జలాలను తరలించారని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నేతలను విమర్శించడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. సింగరేణి పరిరక్షణ కోసం కార్మికులు, ప్రజలను సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని బాల్క సుమన్ స్పష్టం చేశారు.

# కేటీఆర్‌కు అంత అహంకారం ఎందుకు..?

**జనం వాయిస్, కరీంనగర్, సిరిసిల్ల, సెప్టెంబర్ 30:**

సిరిసిల్ల: సిరిసిల్ల అంటే సిరులకు నిలయంగా ఉండాల్సిందిపోయి గత బీఆర్‌ఎస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలతో 'ఊరిసిల్ల'గా మారిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆస్తులు కూడబెట్టుకున్నారంటూ ఆరోపణలు చేశారు.

## అధికారంలోకి వచ్చాక ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి?

2009 ఎన్నికల్లో కేవలం 172 ఓట్ల తేడాతో కేటీఆర్ గెలిచారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ తర్వాత అధికారాన్ని అడ్డుపెట్టుకుని భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. అమెరికాలో అంట్లు తోమిన వ్యక్తికి, హోటళ్లలో చిప్పలు కడిగిన వ్యక్తికి ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి ముఖ్యమంత్రి చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత వ్యక్తుల వివరణలు లేదా ఆధారాలు వేరుగా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొనవచ్చు.

## 'సిరిసిల్ల సిరుల సీమ'ను ఊరిసిల్లగా మార్చారు

చేనేతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన సిరిసిల్లలో నేత కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని సీఎం అన్నారు. కేటీఆర్‌ను పలుమార్లు గెలిపించినా చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఎందుకు ఆగలేదని, గల్ఫ్ దేశాలకు వలసలు ఎందుకు తగ్గలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నవారు సిరిసిల్ల ప్రజలకు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని సూచించారు.

## మానేరు ఇసుక దోపిడీపై ఆరోపణలు

మానేరు ఇసుక వ్యవహారం, నేరెళ్ల ఘటన, మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్వాసితుల అంశాలను సీఎం ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను ప్రశ్నిస్తూ బీఆర్‌ఎస్ నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు భారీగా ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపించారు.

## హామీలు ఎక్కడ? అమలు ఎందుకు కాలేదు?

దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ప్రతి ఇంటికీ ఉద్యోగం వంటి హామీలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి కుటుంబ ఆస్తులు, ఫామ్‌హౌస్‌లను పెంచుకున్నారని ఆరోపించారు.

## వలస కార్మికులకు రూ.5 లక్షల సాయం

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విధానం తీసుకొచ్చామని సీఎం తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.

## కరీంనగర్‌లో ఉద్యోగులకు సీఎం కీలక సూచనలు

అంతకుముందు కరీంనగర్‌లో నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రభుత్వ ఉద్యోగులే సంక్షేమ పథకాలను పేదలకు చేర్చే కీలక ప్రతినిధులని అన్నారు. రాష్ట్రంలో పూర్తికాలపు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కలిపి సుమారు 10.5 లక్షల మంది ఉద్యోగులు నాలుగు కోట్ల మంది ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు.

## పేదవాడికి ప్రభుత్వ కార్యాలయం నమ్మకం కలిగించాలి

సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే నిరుపేదలను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలని ఉద్యోగులకు సీఎం సూచించారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడ్డ పేరు వచ్చినా ఉద్యోగుల పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు.

## కరీంనగర్ అభివృద్ధికి రూ.944 కోట్లు

కరీంనగర్ జిల్లాలో సుమారు రూ.944 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర సహకారంతో రూ.840 కోట్ల నిధులు సాధించామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేస్తామని స్పష్టం చేశారు.

## కంటోన్మెంట్ అడ్డంకికి పరిష్కారం

కరీంనగర్--హైదరాబాద్ మార్గంలో కంటోన్మెంట్ ప్రాంతం ప్రధాన అడ్డంకిగా ఉందని సీఎం తెలిపారు. కేంద్రంతో చర్చల ద్వారా సుమారు 170 ఎకరాల రక్షణ భూమిని రాష్ట్రానికి అందించారని, సుమారు రూ.5 వేల కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. అభివృద్ధి విషయంలో రాజకీయ సిద్ధాంతాలు వేరైనా కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అన్నారు.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 30:**

మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి,




నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.

డైనమిక్ జనంవాయిస్ తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం
PRGI NO: TGTEL/26/A0383

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

- అనుమతి లేని డ్రోన్లు, డీజే ధ్వనులపైనా కఠిన చర్యలు.
- రామగుండం కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు: సీపీ అంబర్ కిషోర్ ఝా.




**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 30:**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేకుండా డ్రోన్లు వినియోగించడం, అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేయడంపై నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో అక్టోబర్ 1 నుంచి నవంబర్ 1 వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు. మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్యకరంగా ప్రవర్తించడం వల్ల ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిషేధాజ్ఞలు అక్టోబర్ 1, 2026 నుంచి నవంబర్ 1, 2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### డీజేలకు అనుమతి తప్పనిసరి

మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో డీజే ధ్వనుల వినియోగంపై కూడా నిషేధాజ్ఞలను పొడిగించినట్లు సీపీ తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా, శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు అధిక శబ్దంతో కూడిన డీజేల వినియోగాన్ని నియంత్రిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా కార్యక్రమంలో మైక్ సెట్ వినియోగించాల్సి వస్తే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, మైక్ సెట్లు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో సిటీ పోలీస్ యాక్ట్ తదితర చట్టాల ప్రకారం అక్టోబర్ 1 ఉదయం 6 గంటల నుంచి నవంబర్ 1 ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని సీపీ తెలిపారు. ఈ కాలంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత పోలీస్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు.

# పుష్కర ఘాట్‌లో విద్యుత్ ఏర్పాట్ల పరిశీలన

**భక్తులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలి. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి.**



**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 30:**

మంథని గోదావరి పుష్కరాలు--2027 నేపథ్యంలో పుష్కర ఘాట్ వద్ద విద్యుత్ ఏర్పాట్లను టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంథని సెక్షన్ పరిధిలోని గోదావరి నది పుష్కర ఘాట్‌ను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన విద్యుత్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా సిద్ధం చేయడంతో పాటు విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీఎండీ తెలిపారు. విద్యుత్ సరఫరా పరిస్థితి, అవసరమైన మౌలిక వసతులు, భద్రతా చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### దుబ్బపల్లి సోలార్ ప్లాంట్ పరిశీలన

అనంతరం దుబ్బపల్లిలో ఇటీవల ఛార్జ్ చేసిన ఎస్‌హెచ్‌జీ సోలార్ ప్లాంట్‌ను సీఎండీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాంట్ పనితీరు, విద్యుత్ ఉత్పత్తి, గ్రిడ్‌కు అనుసంధానం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని మరింత పెంచే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సోలార్ ప్లాంట్ నిర్వహణలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టేశారు!

- కార్మికులకు జీతాలు ఇవ్వాలంటే బ్యాంకుల చుట్టూ తిరిగే దుస్థితి.
- ఓసీపీలన్నీ కాంట్రాక్టర్ల మయం..
- ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలి.
- కార్మికుల హామీలు అమలు చేసి లాభాల వాటా ప్రకటించాలి: ఈటల రాజేందర్.






**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 30:**

ఒకప్పుడు వేల కోట్ల రూపాయల డిపాజిట్లతో ఆర్థికంగా బలంగా ఉన్న సింగరేణి సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టేశారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు జీతాలు చెల్లించేందుకు కూడా బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం నియోజకవర్గానికి వచ్చిన ఈటల రాజేందర్‌కు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్పగుచ్ఛాలతో ఆయనను సత్కరించారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త వేణుమలాని నివాసంలో అల్పాహార విందులో పాల్గొన్న ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు.

### ఓసీపీలన్నీ కాంట్రాక్టర్ల మయం

సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు (ఓసీపీలు) కాంట్రాక్టర్ల మయంగా మారాయని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సంస్థ ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల ఆగ్రహానికి గురికాకముందే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

### గత ప్రభుత్వ హామీలు అమలు కాలేదు

సింగరేణి కార్మికులకు గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఈటల రాజేందర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇదే విధానం కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణి బకాయిలు, లాభాల వాటా, కార్మికుల సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### రైతులకు విద్యుత్‌పై ఆందోళన

రాష్ట్రంలో రైతులకు ఎనిమిది గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని ఈటల రాజేందర్ ఆరోపించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

### రాజకీయాలు పక్కనపెట్టి సాగునీరు ఇవ్వాలి

రైతుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా పరిష్కరించాలని ఈటల రాజేందర్ సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న లోపాలను సరిచేసి నీటిని ఎత్తిపోసి రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. సింగరేణి, విద్యుత్, రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

### పాల్గొన్న నాయకులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డితో పాటు జూలపల్లి ప్రవీణ్ రావు, మంగీలాల్, వొల్లాల సురేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముసుకుల భాస్కర్ రెడ్డి, బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నరసయ్య, సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనర్సయ్య, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, 8 ఇంక్లైన్ కాలనీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్, అంతర్గాం మండల అధ్యక్షుడు బోడకుంటి సుభాష్, పాలకుర్తి మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్, జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ సులువ పద్మ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు వెల్తూరి సరిత, జిల్లా లేబర్ సెల్ కో-కన్వీనర్ ఎల్తురి రాజయ్య, కొట్టే నరేష్, జక్కుల పద్మ, జక్కుల ప్రవీణ్, శిలారపు కళ్యాణ్, బియ్యాల మహేందర్, పాకాల నరసింహారెడ్డి, రాజేందర్, మీస వికాస్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు

**అధిక సంఖ్యలో వయోవృద్ధులు పాల్గొని విజయవంతం చేయాలి: కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**



**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 30:**

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 1న పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కులు, గౌరవప్రదమైన జీవనం, సమాజంలో వారికి కల్పించాల్సిన గౌరవం తదితర అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని వయోవృద్ధులు సకాలంలో కార్యక్రమానికి హాజరై అధిక సంఖ్యలో పాల్గొని అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు.

# రోడ్డు ప్రమాద కేసులో ట్యాంకర్ డ్రైవర్‌కు 6 నెలల జైలు

**రూ.500 జరిమానా విధించిన గోదావరిఖని కోర్టు**

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 30:**

అజాగ్రత్తగా యాష్ ట్యాంకర్‌ను నడిపి సింగరేణి ఏరియా ఆసుపత్రి ఫార్మసిస్ట్ ఎర్రంబోతు సుజనా (51) మృతికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్ దావూద్ షేక్‌కు గోదావరిఖని 1వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ రామగిరి స్వారిక ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. బుధవారం న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా కామటి గ్రామానికి చెందిన దావూద్ షేక్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఎన్టీపీసీ పీటీఎస్‌లో నివాసం ఉంటూ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న ఎర్రంబోతు సుజనా 2018 ఫిబ్రవరి 21న విధులు ముగించుకుని జూపిటర్ మోపెడ్‌పై ఎన్టీపీసీలోని తన ఇంటికి బయలుదేరారు. కవిత థియేటర్ దాటి లయన్స్ భవన్ ఎదురుగా రాజీవ్ రహదారిపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన యాష్ ట్యాంకర్‌ను దావూద్ షేక్ అజాగ్రత్తగా నడుపుతూ సుజనా ప్రయాణిస్తున్న మోపెడ్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆమె కిందపడగా ట్యాంకర్ ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి కుమారుడు రాహుల్ మండేల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ ఎం.డి. కరీంబేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిపై న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏ. ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారులు అభి, ఎం. ఉదయ్, హోంగార్డు కె. తిరుపతి సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహీద ఫర్వీన్ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ ఏ. ఇంద్రసేన రెడ్డితో పాటు ప్రాసిక్యూషన్ విభాగం, కోర్టు డ్యూటీ అధికారులు, హోంగార్డును ఏసీపీ మడత రమేష్, పెద్దపల్లి డీసీపీ భూక్యా రాంరెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

# కార్మికలోకమా మేలుకో.. సింగరేణి భవిష్యత్తును కాపాడుకోవడం మన బాధ్యత

**కార్మికుల హక్కుల రక్షణకు సీఐటీయూ అండగా ఉంటుంది.**

**వకీల్‌పల్లి గని వద్ద గేట్ మీటింగ్‌లో కుంట ప్రవీణ్ కుమార్.**

**జనం వాయిస్, రామగుండం, సెప్టెంబర్ 30:**

కార్మిక సంఘాలతో చర్చించి తమ సమస్యలను పరిష్కరించుకోవడం కార్మికుల రాజ్యాంగబద్ధమైన హక్కు అని సీఐటీయూ రామగుండం-2 బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్ అన్నారు. ఏ కష్టమొచ్చినా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. వకీల్‌పల్లి గని వద్ద బుధవారం ఉదయం 5 గంటల షిఫ్ట్ సమయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కొన్ని సంఘాలు కార్మికులను వివిధ రకాల ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తాయని కుంట ప్రవీణ్ కుమార్ అన్నారు. ముఖ్యంగా సింగరేణిలో కొత్తగా చేరిన కార్మికులు ఇలాంటి మాయమాటలకు లొంగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్మికులకు న్యాయబద్ధంగా రావాల్సిన వేతన ఒప్పందాలు జాతీయ సంఘాల ద్వారా సాధించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం జాతీయ సంఘాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి సంస్థకు సంబంధించిన ఉద్యోగ, సర్వీసు అంశాల్లోగానీ, కార్మిక సంఘానికి సంబంధించిన విషయాల్లోగానీ ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా సీఐటీయూ యూనియన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, హక్కుల రక్షణ కోసం సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ తిరుపతి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రాజశేఖర్, ఆలేటి రాజు, సజ్జత్, సిరాజ్, గుర్రం మహేష్, సుజ్జాన్, సమీర్, నరేందర్, వేణు, విజయ్‌తో పాటు పలువురు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అప్పు అడిగినందుకు యువకుడిపై దాడి

**జనం వాయిస్, రామగిరి, సెప్టెంబర్ 30:**

రామగిరి అప్పుగా ఇచ్చిన రూ.2 లక్షలు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తనపై దాడి చేసినట్లు బేగంపేటకు చెందిన సాయిరాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు.. బుధవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో అప్పు విషయమై మాట్లాడుకుందామని తాళ్లపల్లి నరేష్.. సాయిరాంను సమీపంలోని ఇటుక బట్టీల వద్దకు పిలిచాడు. అక్కడ అప్పు విషయమై ఇద్దరి మధ్య మాటామాటా జరిగిన అనంతరం నరేష్ కట్టెతో తనపై దాడి చేసినట్లు సాయిరాం పేర్కొన్నాడు. ఆ దాడి అనంతరం సాయిరాం అక్కడి నుంచి ఇంటికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత నరేష్ కూడా ఇంటి వద్దకు వచ్చి మరోసారి గొడవ జరుగగా నరేష్ ఉలితో దాడి చేయడంతో తాను తీవ్రంగా గాయపడినట్లు సాయిరాం తెలిపాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సాయిరాం ఫిర్యాదు మేరకు రామగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# కరాటేలో విఘ్నేష్‌కు రెండు స్వర్ణాలు

**పిల్లలను ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత : ఎస్పీ శబరీష్.**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**



ముంబైలోని ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వరల్డ్ ఫునాకోషి షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ ఆల్ ఇండియా, ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మహబూబాబాద్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ సోమలింగయ్య కుమారుడు జి. విఘ్నేష్ యాదవ్ ప్రతిభ కనబరిచాడు. అండర్-12 ఆరెంజ్ బెల్ట్ విభాగంలో పోటీపడి రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ విఘ్నేష్‌ను అభినందించారు. చిన్న వయస్సులోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు, పోలీస్ కుటుంబానికి మంచి పేరు తీసుకొచ్చాడని ప్రశంసించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు.

# లింగ్యా తండాలో 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం'

- **20 వాహనాలు సీజ్, 1,000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం.**
- **సబ్ ఇన్‌స్పెక్టర్ బి. సతీష్.**

**కురవి, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు రూరల్ సిఐ అంజలి సమక్షంలో కురవి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలపాల లింగ్యా తండా గ్రామంలో బుధవారం ఉదయం పోలీసులు భారీ తనిఖీలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఉదయం 05:30 గంటల నుండి ఏడు గంటల నలభై ఐదు నిమిషాల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ బి. సతీష్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలోని సుమారు 100 ఇళ్లు, వాటి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 30 లీటర్ల గుడుంబా, సుమారు 1,000 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వీటిని కలిగి ఉన్న వ్యక్తులపై కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



**గ్రామస్తులకు అవగాహన సదస్సు :**
తనిఖీల అనంతరం పోలీసులు గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాల భద్రతలో సిసి కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో సర్కిల్ ఫోర్స్‌కు చెందిన 26 మంది, స్పెషల్ పార్టీకి చెందిన 14 మందితో కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పోషకాహారమే ఆరోగ్యానికి పునాది.

- **స్థానికంగా లభించే ఆహారంతోనే పౌష్టికత.**
- **సర్పంచ్ మామిడి అశోక్.**

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 30:**

స్థానికంగా లభించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొప్పుల గ్రామ సర్పంచ్ మామిడి అశోక్ సూచించారు. బుధవారం మండలంలోని కొప్పుల గ్రామంలో సెక్టార్ స్థాయి పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు వంటి వాటిని నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రత్యేకంగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పత్తిపాక సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునిత మాట్లాడుతూ ప్రతిరోజూ గుడ్డు, పాలు తీసుకోవడంతోపాటు ఐరన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్వాల భాస్కర్, వార్డు సభ్యుడు శానబోయిన మల్లేష్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# చిన్నారి మృతికి జర్నలిస్టులు పరామర్శ

**కురవి, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన జర్నలిస్ట్ గండమాల రోషయ్య కుమార్తె చిన్నారి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్టులు అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చందా శ్రీనివాస్, బొడ్డు అశోక్ లు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సోషల్ మీడియా సీనియర్ జర్నలిస్ట్ దడిగెల రవి, తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్టులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బేతమళ్ళ సహదేవ్, జర్నలిస్ట్ లు గండమాల రామకృష్ణ, దుంఢ్ర నిర్మల తదితరులు ఉన్నారు.



# సింగరేణి యాజమాన్యానికి కళాకారుల కృతజ్ఞతలు

**కళాకారులకు సంగీత, వాయిద్య పరికరాలు అందించేందుకు చర్యలు. ఆర్జీ-1 ఏరియా కల్చరల్ కమిటీ కెప్టెన్ పొన్నాల శంకర్.**

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 30:**

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కళాకారులకు సంగీత, వాయిద్య పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్న యాజమాన్యానికి ఆర్జీ-1 ఏరియా కల్చరల్ కమిటీ కెప్టెన్ పొన్నాల శంకర్, సీనియర్ కళాకారుడు చీకటి అంజయ్యతో పాటు ఆర్జీ-1 ఏరియాకు చెందిన కళాకారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత కొంతకాలంగా సింగరేణి కళాకారులకు అవసరమైన సంగీత, వాయిద్య పరికరాలు అందించాలని యాజమాన్యాన్ని కోరుతూ వస్తున్నామని వారు తెలిపారు. కళాకారుల ప్రతిభను గుర్తించి వారి కళా ప్రదర్శనలకు మరింత ప్రోత్సాహం అందించేలా యాజమాన్యం చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కళాకారులకు అవసరమైన వాయిద్య పరికరాల కొనుగోలు కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, సింగరేణిలోని అన్ని ఏరియాల్లో కళాకారులకు పరికరాలు అందించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



**వినతులకు స్పందించిన యాజమాన్యం**
సింగరేణిలో పనిచేస్తున్న కళాకారుల సమస్యలను సెప్టెంబర్ 17న వినతిపత్రం ద్వారా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సింగరేణి సీఎండీ స్థాయి నుంచి జనరల్ మేనేజర్ స్థాయి వరకు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసి కళాకారులకు సంగీత, వాయిద్య పరికరాలు అందించాలని కోరినట్లు వెల్లడించారు. ఈ కృషికి సానుకూల స్పందన లభించడంతో ప్రస్తుతం అన్ని ఏరియాల్లో వాయిద్య పరికరాలు అందించేందుకు యాజమాన్యం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంలో గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ తరఫున కళాకారుల సమస్యల పరిష్కారం కోసం, సంగీత వాయిద్య పరికరాల సాధన కోసం కృషి చేసిన అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లకు కళాకారుల తరఫున హృదయపూర్వక కళాభివందనాలు తెలిపారు. సింగరేణిలో కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ సాంస్కృతిక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా అందరి సహకారం కొనసాగాలని వారు కోరారు. "కళాకారుల ఐక్యత--కళల అభివృద్ధి--సింగరేణి సాంస్కృతిక వైభవం" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# చెరువు శిఖాల ఆక్రమణలకు చెక్.

- **రీ-సర్వే తర్వాతా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు.**
- **కస్తూర్బా హాస్టల్‌లో వసతులపై ఆరా.**
- **అదనపు కలెక్టర్ ఎన్. రవి.**

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 30:**

చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి హెచ్చరించారు. బుధవారం శాయంపేట మండలం హుస్సేన్‌పల్లిలో కొనసాగుతున్న రీ-సర్వేను పరిశీలించిన ఆయన.. అనంతరం గోవిందపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు.

**మూడు కేటగిరీలుగా గుర్తింపు..**
మండలంలోని ఐదు గ్రామాలను రీ-సర్వేకు ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. భూముల విస్తీర్ణం, హద్దులు, పట్టా, అనుభవ వివరాలను క్షేత్రస్థాయిలో



పరిశీలించి నమోదు చేస్తున్నట్లు చెప్పారు. చెరువు శిఖం భూములను మూడు కేటగిరీలుగా గుర్తిస్తున్నట్లు వివరించారు. పట్టా ఉండి అనుభవంలో ఉన్న భూములు, పట్టా ఉండి అనుభవంలో లేని భూములు, పట్టా లేకపోయినా అనుభవంలో ఉన్న భూములుగా వర్గీకరిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామన్నారు. చెరువు శిఖాలను ఆక్రమించి సాగు చేయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతోపాటు వర్షాకాలంలో పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. శిఖాల హద్దులను పక్కాగా నిర్ధారించి ఆక్రమణలను గుర్తిస్తామని తెలిపారు. రీ-సర్వే అనంతరం కూడా ఆక్రమణలకు పాల్పడితే పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజ్ యాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



**హాస్టల్‌లో వసతుల పరిశీలన..**
గోవిందపూర్ కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌లో విద్యార్థుల హాజరు, భోజనం, తాగునీరు, వసతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతులు, భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డీఎస్. వెంకన్న, తహసీల్దార్ ఆర్. ప్రవీణ్‌కుమార్, ఎంఆర్ఐ అజ్మీర చిమ్మన్ నాయక్, ఏఆర్ఐ రమేష్, జీపీఓలు నరేష్, దేవేందర్, సర్వేయర్లు, శశాంక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి మాధవి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కుటుంబానికి గ్రామ శాఖ అండ

**రూ.11,500 ఆర్థిక సాయం.. 25 కేజీల బియ్యం అందజేత**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త సుదనబోయిన వెంకన్న మాతృమూర్తి వెంకటమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె మృతిపట్ల బేతోలు బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు తీవ్ర సంతాపం, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బుధవారం వెంకటమ్మ కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పరామర్శించి, కుటుంబానికి అండగా నిలిచారు. గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ.11,500 నగదు ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ పటిష్టత కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. కార్యకర్తలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి తోడుగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. మాతృవియోగంతో బాధపడుతున్న కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బేతోలు గ్రామ శాఖ నాయకులు షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్, సిరికొండ కృష్ణ, ఏర్పుల హుస్సేన్, గద్దపాటి వేణు, జిన్నుక ఎల్లయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# జిగ్‌జాగ్ రన్నింగ్‌లో వరుణ్ తేజ్‌కు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 30:**

మంచిర్యాల జిల్లాస్థాయిలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో జిగ్‌జాగ్ రన్నింగ్ స్పెషల్ కేటగిరీ విభాగంలో మందమర్రి ఫిల్టర్‌బెడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి చిరంజీవి వరుణ్ తేజ్ ప్రథమ స్థానాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు భీమ్‌పుత్ర శ్రీనివాస్, జలంపెల్లి చింతకింది లలిత, గుడివెనుక రవి, జి.కిరణ్ తదితరులు వరుణ్ తేజ్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.




# విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

**జనం వాయిస్,శాయంపేట,సెప్టెంబరు 30:**

విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడేలా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మండల విద్యాధికారి జి. భిక్షపతి అన్నారు. బుధవారం శాయంపేట ప్రాథమిక పాఠశాలలో మేరుగు కమలాకర్ (యూఎస్ఏ) 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 75 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎంఈఓ ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందజేశారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారిని ప్రోత్సహించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్ల అశోక్‌రెడ్డి, మేడిపల్లి సురేందర్, బి. ప్రవీణ, కే. ఉమా, పి. స్వప్నరాణి, పి. ప్రత్యూషతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



# చేయూత పింఛన్ల వెరిఫికేషన్‌పై అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 30:**



మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ ప్రాంతంలో కొనసాగుతున్న చేయూత పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పి. చంద్రయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాల పరిశీలన, నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. వెరిఫికేషన్‌లో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఉన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఈ. రాజేశ్వరి, వార్డు ఆఫీసర్ ఎస్. రాజేశ్వర్ రావు, డీపీఓ బి. శ్యాంబాబు, సిస్టమ్ మేనేజర్ ఏ. శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయుడికి పాడె మోసిన సిరికొండ

**చిరకాల సహచరుడికి కన్నీటి వీడ్కోలు**

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 30:**

శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన తన చిరకాల సహచరుడు మంద రాజమల్లు (చిన్నోడు) మృతికి శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి సంతాపం తెలిపారు. బుధవారం రాజమల్లు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోస్తూ ఆత్మీయ సహచరుడికి అంతిమ వీడ్కోలు పలికారు. రాజమల్లు మృతి తనకు, ఆయన కుటుంబానికి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.



PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్ NEWS
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న ఈ సి జ్ఞానేశ కుమార్ ను బర్త్ రఫ్ చేయాలి

**నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు.**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 (జనం వాయిస్) :**

కేంద్ర బీజేపీ ప్రభుత్వ తోత్తులా వ్యవహరిస్తు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే భర్త్ రఫ్ చే యాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మరిపెడ మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ తో సిపిఐ శ్రేణులు నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం లో మెజారిటీ సభ్యుల నిర్ణయాన్ని బేకాతర చేస్తూ ఏకపక్ష నిర్ణయాలతో సి ఈ సి జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్ట పాలు చేస్తూ, సర్ ప్రక్రియను ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి ఉపయోగిస్తూ, రకరకాల కోర్రీలతో లక్షలాది ఓట్లు గల్లంతు అయ్యే విధంగా ప్రతిపక్ష పార్టీలు ఆయా రాష్ట్రాలలో అధికారం కోల్పోవడానికి కారణమై, బిజెపికి తొత్తులా వ్యవహరిస్తు, కోట్లాదిమంది ప్రజలను




అభద్రతా భావానికి, తీవ్ర ఆందోళనకు గురిచేసే సర్ ప్రక్రియను వెంటనే ఆపేసి, జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుండి భర్త రఫ్ చేయాలని, తొలిగించిన 13కోట్ల ఓటర్ల ను వెంటనే చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారగని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేపాక వెంకన్న అంజి, పి వెంకన్న, వీరన్న, హనుమంతు, కలగూర నాగరాజు, వీరన్న, సత్యం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హిందువులకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి: మారం రవికుమార్

**సెప్టెంబర్ 30 జనం వాయిస్ పాలకుర్తి:**

పాలకుర్తి మండల కేంద్రంలో ప్రధాని మోదీపై, హిందూ దేవతలపై, సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, పాలకుర్తి బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు మారం రవికుమార్ ఆధ్వర్యంలో.సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించిన బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు దామోదర్ రెడ్డి దొంగరి మహేందర్ తో కలిసి మాట్లాడుతూ దేశ ప్రధానిపై రాజకీయ విమర్శలు చేయడం హేయమైన చర్య అని, కోట్లాదిమంది హిందువులు ఆరాధించే శ్రీరాముడు పరమశివుడు, వంటి దేవతలను రాజకీయాలకు ముడిపెట్టి మాట్లాడడం కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలకు స్థానం ఉందని, అయితే హిందూ దేవుళ్లకు రాజకీయ వ్యాఖ్యలకు వేదికగా మార్చడం సమంజసం కాదని అన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్ రెడ్డి, జిల్లా నాయకులు సుంకరనేని కోటేశ్వర్, బిజెపి మాజీ అధ్యక్షులు కమ్మగాని శ్రీకాంత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మంచినీళ్ళ ఉపేందర్ రెడ్డి,వాసు యాదవ్ మండల ఉపాధ్యక్షులు పబ్బ సంతోష్, మండల ప్రధాన కార్యదర్శులు పెనుగొండ సోమేశ్వర్ ,దేవరాజు, బొచ్చు సురేష్ యాదవ్, కడుదుల నిరంజన్, ఇలవెల్లి యాకయ్య,శ్రీనివాస చారి,బెల్లంకొండ ఉపేందర్ ,తదితరులు పాల్గొన్నారు.



# అప్రమత్తతే రక్షణ.. మహిళలు, బాలికల భద్రతకు షీ టీం అండ

- వేధింపులు, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన.
- సమస్య ఎదురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి : షీ టీం ఎస్ఐ సునంద.



**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతపై కేసముద్రం పరిధిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్‌గ్రేడెడ్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో బుధవారం మహబూబాబాద్ షీ టీం, కేసముద్రం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్ఐ సునంద మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్య అంశమని తెలిపారు. ఈవ్‌టీజింగ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి వేధింపులు లేదా సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను, షీ టీంను సంప్రదించాలని సూచించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించే సమయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సునంద సూచించారు. సైబర్ నేరం లేదా ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళలు లేదా బాలికలు వేధింపులకు గురైనప్పుడు షీ టీం నంబర్ 8712656935ను సంప్రదించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, చిన్న వయసులో ప్రలోభాలకు లోనుకాకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని ఎస్ఐ సునంద సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఓపికతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే దాచుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని, "ఏ సమస్య ఉన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయండి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. సుజాత, అధ్యాపక బృందం, సుమారు 550 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. షీ టీం సిబ్బంది రమేష్, సుధారాణి, ప్రియాంక, కేసముద్రం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ధర్మానాయక్, ఉమెన్ కానిస్టేబుల్స్ అరుణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# పీఎంజడ్.పి.హెచ్.ఎస్. పాలకుర్తిలో ఘనంగా మాక్ పార్లమెంట్ నిర్వహణ

**సెప్టెంబర్ 30 జనం వాయిస్ పాలకుర్తి:**




పీఎం జడ్.పి.హెచ్.ఎస్. పాలకుర్తి పాఠశాలలో ఈరోజు విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ విధానాలు, నాయకత్వ లక్షణాలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందించే ఉద్దేశంతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మాక్ పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్‌గా లావుడియా బేబీ, ప్రధానమంత్రిగా గుగులోతు జగన్, ప్రతిపక్ష నాయకుడిగా లకావత్ వరుణ్ వ్యవహరించారు. 2026--27 సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి భూక్య సంధ్య సభలో ప్రవేశపెట్టారు . హోం మంత్రిగా సింధు ప్రియా బాధ్యతలు నిర్వహించారు. సభా కార్యక్రమంలో ప్రతిపక్ష సభ్యులు వివిధ అంశాలపై ప్రశ్నలు అడగగా, సంబంధిత శాఖల మంత్రులు వాటికి సమాధానాలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పార్లమెంటు నిర్వహణ విధానం, ప్రశ్నోత్తరాల ప్రక్రియ, బడ్జెట్ ప్రవేశపెట్టడం, పాలక-- ప్రతిపక్ష సభ్యుల పాత్రలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాలకుర్తి మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నరసయ్య హాజరయ్యారు. అలాగే గూడూరు, ముత్తారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శైలజ మరియు అంజయ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సుమతా మరియు మధు ముందుండి విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్పృహ, నాయకత్వ లక్షణాలు, ప్రశ్నించే తత్వం, బాధ్యతాయుత పౌరసత్వ భావన పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్ నరసింహమూర్తి, అశోక్ కుమార్ వెంకటయ్య, మాలతి, మెహర్ నిషా బేగం, రవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

**అక్టోబర్ 2న నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయండి.**
**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్.**

**సెప్టెంబర్ 30 జనం వాయిస్ పాలకుర్తి:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిట్యాల సోమన్న అధ్యక్షత వహించగా రమేష్ పాల్గొని మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన విబిజి గ్రాంజి చట్టాన్ని



రద్దు చేయాలని డిమాండ్ చేశారు, వ్యవసాయ కూలీల ప్రభుత్వ వ్యతిరేక విధానాలు నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా గ్రామ మండల మహాత్మా గాంధీ విగ్రహాల దగ్గర అక్టోబర్ 2న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం. దళిత గిరిజన వృత్తి ప్రజా సంఘాలు చేపట్టబోయే కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, వామపక్షాల పోరాటాల ఫలితంగా యూపీఏ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వందరోజుల పనిని గ్యారెంటీ చేస్తూ తెచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా రద్దు చేసిందని విమర్శించారు, దాని స్థానంలో విబిజి రాంజి చట్టాన్ని తీసుకొచ్చిందని, కొత్త చట్టంలో 125 రోజులు పని దినాలు పెంచిన కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయింపులో భారీ కోత విధించిందని చెప్పారు, కేంద్రం ఇచ్చే 90% నిధుల వాటా నుండి 60 శాతానికి కుదించిందని, రాష్ట్ర ప్రభుత్వాల మీద 40% ఆర్థిక భారాన్ని మోపడం చూస్తే పేదలకు పని కల్పించే బాధ్యతనుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకోవడంలో భాగమేనని తెలిపారు. పారదర్శకత పేరుతో రెండుసార్లు ఫోటోలు ఆన్లైన్లో అప్లోడ్ అయితేనే వేతనాలు ఇస్తామనడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు, తక్షణం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా పునరుద్ధరణ చేయాలని, పని దినాలు 200 రోజులకు పెంచాలని, రోజువారి కూలీ 800 రూపాయలు ఇవ్వాలని, కరువు మండలాలను ప్రకటించి ప్రత్యేక పని దినాలు పెంచాలని. పట్టణ ప్రాంత పేదలకు పనిని విస్తరింప చేయాలని. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ధర్నాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిట్యాల సోమన్న, ఉపాధ్యక్షులు పొత్కునూరి ఉపేందర్, గోసంగి శంకరయ్య, సంకి నరేష్, పొలాస కిష్టయ్య, కుమ్మెర సుధా, కాకర్ల పద్మ, ఐలాపురం నరసమ్మ, కాకర్ల బాబు తదితరులు పాల్గొన్నారు

# దేవరుప్పుల గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించిన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి

**సెప్టెంబర్ 30 జనం వాయిస్ పాలకుర్తి:**



దేవరుప్పుల మండలంలోని ధర్మపురం, దేవరుప్పుల గ్రామాల్లో పలు కుటుంబాలను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మపురం గ్రామంలో దండు సోమయ్య మృతి పట్ల వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దండు సోమయ్య పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ముత్యాల లక్ష్మి సర్జరీ గురించి తెలుసుకుని, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం దేవరుప్పుల గ్రామంలో తోటకూరి వెంకన్న అమ్మగారి హార్ట్ సర్జరీ గురించి తెలుసుకుని పరామర్శించారు. అలాగే కారుపోతుల విజయ్ నాన్నగారి మృతి, ఉప్పుల నాగరాజు భార్య మృతి, బోజ్జం సుధీర్ నాన్న మృతి, భాషిపాక శోభన్ తల్లి మృతి సందర్భంగా ఆయా కుటుంబాలను పరామర్శించారు. మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అదేవిధంగా రెడ్డిరాజుల రమేష్ పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దావెర అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- ప్రభుత్వ హాస్పిటల్ లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి.
- పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి.
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు, నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన వేగవంతమైన వైద్య సేవలు అందించడం కోసం సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని షెడ్యూల్ ప్రకారం మెడికల్ క్యాంపులో నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్య సంస్థలలో పిల్లలకు వంట చేసే సిబ్బందికి కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని అట్టి నివేదికలో తమకు సమర్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణీలకు పిల్లలకు బాలింతలకు సంబంధించిన టీకాలు క్రమం తప్పకుండా వేయాలని, మాతా శిశు మరణాలను అరికట్టాలని, హాస్పిటల్ కి వచ్చే ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ మెడిసిన్ రిజిస్టర్ లను అటెండెన్స్ రిజిస్టర్లు తనిఖీ చేశారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ల వారీగా మందులను



సిద్ధంగా ఉంచుకోవాలని, పిల్లలకు వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం వేయాలి, బోద కాలు, గర్భ సంచీ క్యాన్సర్ ల నివారణ చర్యలు తీసుకోవాలని, సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏమైనా వసతులు, సౌకర్యాల ఇబ్బందులు లేకుండా చూసుకోవన్నారు, అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రతి తరగతి గదిని తనిఖీ చేసి పిల్లలతో స్వయంగా మాట్లాడి భవిష్యత్తు కార్యచరణ ప్రణాళిక పై వారిని అడిగి తెలుసుకున్నారు, క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని ప్రతి సబ్జెక్టుపై నాలెడ్జి పెంచుకోవాలని సూచించారు, ప్రతి విద్యార్థినీ ,విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ లోనే భవిష్యత్తు కార్యాచరణ పై అడుగులు పడతాయని గుర్తుకు చేశారు, పిల్లలు ,ఉపాధ్యాయుల హాజరు శాతం పూర్తిగా నమోదయ్యే విధంగా ప్రిన్సిపల్ చర్యలు తీసుకోవాలని, ఇంగ్లీష్ ప్రతి సబ్జెక్టు పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వంద శాతం ఉత్తీర్ణత పొందే విధంగా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు, ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, నెల్లికుదురు తహసిల్దార్ నరేష్, కళాశాల ప్రిన్సిపల్ వీరస్వామి, ప్రాథమిక వైద్యశాల అధికారి తదితరులు ఉన్నారు.

# నేడు సంగీత, నృత్య శిక్షణ కేంద్రం ప్రారంభం

**జనం వాయిస్,శాయంపేట,సెప్టెంబరు 30:**

మండల కేంద్రంలో సంగీత, నృత్య శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు నాట్య మయూరి వైద్యుల రజితారెడ్డి తెలిపారు. కళలపై ఆసక్తి ఉన్న చిన్నారులు, యువతీ యువకులు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని కోరారు.



జనంవాయిస్

# నేటి నుంచి ఖేలో ఇండియా ఆర్చరీ శిక్షణ శిబిరం

## - జిల్లా యువజన క్రీడల అధికారి డాక్టర్ ఓలేటి జ్యోతి.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 'ఖేలో ఇండియా' ఆర్చరీ (విలువిద్య) ఉచిత శిక్షణ శిబిరం అక్టోబర్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని జిల్లా యువజన క్రీడల అధికారి డాక్టర్ ఓలేటి జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విలువిద్యపై ఆసక్తి, ప్రతిభ ఉన్న విద్యార్థులు, యువత ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. శిక్షణలో చేరదలచిన అభ్యర్థులు ఎన్టీఆర్ స్టేడియంలో నేరుగా సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని అధికారి తెలిపారు. యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాన్ని ఆసక్తిగల వారు వినియోగించుకోవాలని సూచించారు.

# మీ ప్రమాణం యాప్‌లో ఉద్యోగుల వివరాల నమోదు

**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

ప్రభుత్వ నిబంధనలు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు జిల్లాలోని కలెక్టరేట్‌తో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ప్రభుత్వం నుంచి జీతం పొందుతున్న ప్రతి ఒక్కరూ 'మీ ప్రమాణం' యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగంధర్ సూచించారు. యాప్ ద్వారా ముఖచిత్ర హాజరు నమోదు చేసుకునే విధానంపై కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. యాప్‌ను ఎలా వినియోగించాలి, సాంకేతికంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బంది అడిగిన పలు సందేహాలు, సాంకేతిక సమస్యలకు ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగంధర్ సమాధానాలు ఇచ్చారు. యాప్ వినియోగం, ముఖచిత్ర హాజరు నమోదు విధానాన్ని క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ టెక్నికల్ సిబ్బంది కె.అశోక్‌తో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్వాడీ, ఆశా వర్కర్లకు ఘన సన్మానం

## సేవలను గుర్తించి గౌరవించడం అభినందనీయం : బీజేపీ నాయకులు

**కురవి, సెప్టెంబరు 30 (జనం వాయిస్):**

ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనా ప్రస్థానంలో 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా కురవి మండలం నల్లేల గ్రామంలో అంగన్ మిలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శేషగాని సరిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గద్దల సరోజిని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, మహిళల ఆరోగ్యం, పౌష్టికాహారం కోసం అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వారి సేవలను గుర్తించి సన్మానించడం సంతోషకరమని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ పిట్టల భవ్యశ్రీ మాట్లాడుతూ మహిళా సాధికారత, బాలల సంక్షేమం కోసం సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను గౌరవించడం అభినందనీయమన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు కిషన్ నాయక్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు సమాజ సేవకులను గుర్తించి గౌరవించడం పార్టీ కార్యకర్తల బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, మండల ప్రధాన కార్యదర్శులు జిన్నె క్రిష్ణ, కోనతం వెంకటేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు నిమ్మశెట్టి సత్యం, సీనియర్ నాయకుడు కోనతం పెంటయ్య, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# అనబత్తుల ఐలయ్యకు ఘన నివాళులు

## కుటుంబ సభ్యులను పరామర్శించిన గొల్లపల్లి రజనీకాంత్

**కురవి, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**



మొదలగూడెం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అనబత్తుల ఉపేందర్ తండ్రి అనబత్తుల ఐలయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్ ఐలయ్య పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అనబత్తుల ఉపేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని రజనీకాంత్ పేర్కొన్నారు. ఐలయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మొదలగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్, అయ్యగారిపల్లి సర్పంచ్ మాధవి నాగన్న, పిల్లిగుండ్ల తండా సర్పంచ్ బానోత్ రమేష్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఆదేశాలు జారీ చేసి 60 రోజులు దాటినా

# అమలు ఎప్పుడు..?

- **7 రోజుల్లో చర్యలు తీసుకోవాలని మెమో ఇచ్చినా పురోగతి శూన్యం.**
- **రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖలపై రైతు ఉపేందర్ వీరిశెట్టి ఆగ్రహం.**

**కురవి, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

సీరోలు మండలం చింతపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో రైతుల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దశాబ్దాలుగా వినియోగంలో ఉన్న పాత వ్యవసాయ రహదారి, ఇరిగేషన్ బండ్ కాలువ పునరుద్ధరణకు తహసీల్దార్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటి అమలులో జాప్యం కొనసాగుతుండటంపై రైతు ఉపేందర్ వీరిశెట్టి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 27-07-2026న ఆర్. సి. నెం. బి./365/2026 ద్వారా సీరోల్ తహసీల్దార్ కార్యాలయం ఇండియన్ ఏఅసెమెంట్స్ యాక్ట్, 1882 కింద పాత వ్యవసాయ రహదారి, ఇరిగేషన్ బండ్ కాలువ పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. అయితే ఆదేశాలు జారీ చేసి 60 రోజులకు పైగా గడిచినా క్షేత్రస్థాయిలో ఎలాంటి


GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE TAHSILDAR :: SEEROLE MANDAL

Rc.No. B/365/2026 Date:18-9-2026.

MEMO

Sub:- PATH WAY - Mahabubabad District – Seerole Mandal – Chinthapalli Village – A/o Sri Upender Veerishetty S/o Venkataiah, R/o Kothur (C) – Request for immediate implementation of the orders issued by Tahsildar, Seerole Mandal vide Rc.No.B/365/2026, Dtd:27.7.2026 and restoration of the old agricultural access road irrigation bund canal to ensure free access to his agricultural lands - Visit the site and see that not to obstruct by any one for use said path way – Compliance report called - Reg.

Ref:- A/o Sri Upender Veerishetty S/o Venkataiah, R/o Kothur (C) Dtd:15.9.2026.

-o0o-

Attention to the subject and reference cited and to inform you that Sri Upender Veerishetty S/o Venkataiah, R/o Kothur (C) submitted an applications stated that an old agricultural access road and irrigation bund canal leading to the agricultural lands situated in Sy.No.41 and Sy.No.43 to 433 of Chinthapalli Revenue Village and the Tahsildar, Seerole Vide Rc.No.B/365/2026 dated: 27.7.2026 issued orders under Easement Act, 1882 on pathway situated in the above Sy.Nos. lands and also requested to effectively implemented the said orders on the ground level stated as below:

1. The Orders issued under the Indian Easements Act, 1892 vide Rc.No.B/365/2026 dtd:27.7.2026, may kindly be implemented immediately and in full.
2. The concerned Revenue Inspector and Revenue authorities, along with Gram Panchayath authorities may kindly conducted field inspection and take necessary steps to physically restore the old agricultural access road and irrigation bund canal as directed in the said orders.
3. If any person creates obstruction to the implementation of the orders, necessary police assistance/security may kindly be obtained from the Seerole Police Station, and appropriate action may be taken under the applicable laws.
4. If any action has already been taken for implementation of the orders, the details and present status of implementation may kindly be communicated to him in writing.
5. If there has been any negligence or failure in the discharge of official duties by the concerned officials in implementing the orders, their responsibility may kindly be fixed and appropriate departmental action may be initiated.
6. Any person obstructing the use of the agricultural access road in violation of the Tahsildar's orders may kindly be proceeded against by initiating applicable criminal and civil action, as mentioned in the said orders.
7. The entire process may kindly be supervised and the restoration of the old agricultural access road and irrigation bund canal may be completed within a stipulated time.
8. A written Action Taken Report (ATR) may kindly be provided to him regarding the action taken on this representation.

....Contd Pg....2....

స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని పేర్కొన్నారు.

### 7 రోజుల్లో ఎటిఆర్ ఇవ్వాలని మరో మెమో

సమస్య పరిష్కారం కోసం 18-09-2026న తహసీల్దార్ కార్యాలయం మరో మెమో జారీ చేసి, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన చేసి ఆదేశాలను అమలు చేయడంతో పాటు 7 రోజుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఎటిఆర్) సమర్పించాలని ఆదేశించినట్లు ఉపేందర్ వీరిశెట్టి తెలిపారు. అయితే ఆ గడువు కూడా పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు రహదారి పునరుద్ధరణ/విస్తరణపై స్పష్టమైన పురోగతి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### "ఆర్డర్ ఇచ్చారు.. అమలు ఎప్పుడు?"

అధికారులు ఆదేశాలు జారీ చేసిన తర్వాత వాటి అమలు కోసం రైతులు మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని ఉపేందర్ వీరిశెట్టి ప్రశ్నించారు. "27 జూలై ఆర్డర్, 18 సెప్టెంబర్ మెమో, 7 రోజుల గడువు ఉన్నప్పటికీ అమలు ఎక్కడ? ఆర్డర్ జారీ చేయడం పరిపాలనా ప్రక్రియలో మొదటి అడుగు మాత్రమే. అది క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే రైతుకు వాస్తవ ప్రయోజనం కలుగుతుంది" అని ఆయన అన్నారు.

### ఎటిఆర్ ను బహిర్గతం చేయాలి :

తక్షణమే రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి తహసీల్దార్ ఆదేశాలను అమలు చేయాలని, చేపట్టిన చర్యలపై ఎటిఆర్ ను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాప్యానికి గల కారణాలను అధికారిక రికార్డుల్లో నమోదు చేసి, రహదారి పునరుద్ధరణ/విస్తరణకు నిర్దిష్ట తేదీని ప్రకటించాలని కోరారు. "ఆర్డర్ పాస్సేడ్‌అనేది కాగితంపై ఉన్న నిర్ణయం మాత్రమే.. ఆర్డర్ ఇంప్లీమెంటెడ్ అయినప్పుడే రైతుకు న్యాయం జరిగినట్లు" అని ఉపేందర్ వీరిశెట్టి పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

# రోశయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**కురవి, సెప్టెంబర్ 30 (జనం వాయిస్):**

డోర్నకల్ నియోజకవర్గం కురవి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ రిపోర్టర్ గంధమల్ల రోశయ్య కుమార్తె ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ బుధవారం రోశయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా





ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరి గౌడ్, నూతక్కి సాంబశివరావు, బొడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, కౌసల్యాదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కురవి మాజీ ఉపసర్పంచ్ సంగేమ్ భరత్, మన్యు ప్యాట్నీ, ప్రముఖ జర్నలిస్టులు ఆమెడ శ్రీధర్, భర్తపురపు వీరన్న, బేతమళ్ళ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# కుండకు కాలం చెల్లుతోందా..?

**మట్టితో మమేకమైన జీవన సంస్కృతికి ఆధునికత దెబ్బ**
**ప్లాస్టిక్, స్టీల్, ఫ్రిజ్‌ల మధ్య కనుమరుగవుతున్న కుమ్మరి కళ.**
**కుమ్మరి చక్రం తిరుగుతున్నా.. కడుపు నిండడం లేదు!**
**మట్టికి విలువ తగ్గింది.. కుమ్మరి బతుకు భారమైంది!**
**ప్లాస్టిక్ పంజాలో మట్టి కుండ.. కనుమరుగవుతున్న సంప్రదాయం!**
**తరతరాల కళకు తెరపడుతోందా..?**
**ఆదరణ లేక అంచుల్లోకి కుమ్మరి వృత్తి!**
**తరతరాలుగా కొనసాగిన వృత్తికి ఆదరణ కరువు.. ఉపాధి కోసం ఇతర పనుల వైపు చూపు.**

### జనం వాయిస్ ప్రత్యేక కథనం

ఒకప్పుడు ప్రతి ఇంటి ముందు కనిపించే కుమ్మరి చక్రం.. నేడు చాలా గ్రామాల్లో అరుదైన దృశ్యంగా మారింది. చేతిలో మట్టి.. చక్రంపై తిరిగే కుండ.. దానికి రూపమిచ్చే కళాకారుడి చేతివేళ్లు.. ఆ తర్వాత ఎండలో ఆరబెట్టి, బట్టీలో కాల్చిన కుండలు.. ఇవన్నీ ఒకప్పుడు గ్రామీణ జీవనంలో విడదీయరాని భాగం. వేసవి వచ్చిందంటే ఇంటింటా మట్టి కుండలోని చల్లటి నీరే దాహాన్ని తీర్చేది. పండుగలు, శుభకార్యాలు, సంప్రదాయ కార్యక్రమాల్లోనూ కుమ్మరి తయారు చేసిన మట్టి పాత్రలకు ప్రత్యేక స్థానం ఉండేది. కానీ కాలం మారింది. జీవన విధానం మారింది. ప్లాస్టిక్ బాటిళ్లు, స్టీల్ పాత్రలు, అల్యూమినియం సామగ్రి, ఫ్రిజ్‌లు, ఆధునిక వంటగది పరికరాలు అందుబాటులోకి రావడంతో మట్టి పాత్రల వినియోగం క్రమంగా తగ్గిపోయింది. ఫలితంగా తరతరాలుగా మట్టినే నమ్ముకుని జీవిస్తున్న కుమ్మరి కుటుంబాల పరిస్థితి సంక్షోభంలో పడింది.









### చక్రం తిరుగుతోంది.. జీవితం మాత్రం ముందుకు సాగడం లేదు

కుమ్మరి వృత్తిలో చక్రం తిరుగుతూనే ఉంటుంది. కానీ ఆ చక్రాన్ని తిప్పే కుటుంబాల జీవితాల్లో మాత్రం ఎన్నో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఒక కుండ తయారు చేయడానికి మట్టి సేకరణ నుంచి ప్రారంభమై.. దానిని శుద్ధి చేయడం, తడపడం, ముద్దగా చేయడం, చక్రంపై ఆకారం ఇవ్వడం, ఎండబెట్టడం, బట్టీలో కాల్చడం వరకు అనేక దశలు ఉంటాయి. ఇంత కష్టపడి తయారు చేసిన కుండకు మార్కెట్‌లో లభించే ధర మాత్రం చాలాసార్లు ఆ శ్రమకు సరైన ప్రతిఫలాన్ని ఇవ్వదు. మట్టి, ఇంధనం, రవాణా ఖర్చులు పెరగడంతో తయారీ వ్యయం కూడా పెరిగింది. మరోవైపు వినియోగదారుల సంఖ్య తగ్గడంతో అమ్మకాలు పడిపోయాయి. దీంతో ఈ వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారుతోంది.

### మట్టికుండలో నీళ్లు.. ప్రకృతి ఇచ్చిన సహజ చల్లదనం

ఫ్రిజ్‌లు లేని కాలంలో మట్టి కుండే ఇంటి సహజ శీతలీకరణ పరికరం. కుండ గోడలలోని సూక్ష్మ రంధ్రాల ద్వారా నీరు నెమ్మదిగా ఆవిరవుతూ లోపల ఉన్న నీటిని సహజంగా చల్లబరుస్తుంది. వేసవిలో కుండ నీటికి ఉండే ప్రత్యేక రుచి, చల్లదనం ఇప్పటికీ చాలామందికి ఇష్టం. ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మట్టి కుండకు ఉన్న ప్రత్యేకత మాత్రం పూర్తిగా మాయ కాలేదు. ముఖ్యంగా సహజ జీవన విధానాన్ని కోరుకునే వారిలో మట్టి పాత్రలపై మళ్లీ ఆసక్తి పెరుగుతోంది. అయితే ఆ ఆసక్తి కుమ్మరి కుటుంబాలకు స్థిరమైన ఆదాయంగా మారే స్థాయిలో ఇంకా విస్తరించాల్సి ఉంది.

### ప్లాస్టిక్ పెరిగింది.. మట్టి పాత్ర తగ్గింది

ఒకప్పుడు నీటిని నిల్వ చేయడానికి కుండలు, ఆహారం వండేందుకు మట్టి పాత్రలు, పెరుగు పెట్టేందుకు మట్టి కుండలు, ధాన్యం నిల్వ చేసేందుకు పెద్ద మట్టి పాత్రలు ఉపయోగించేవారు. ఇప్పుడు వాటి స్థానాన్ని ప్లాస్టిక్, స్టీల్, గాజు, ఇతర ఆధునిక సామగ్రి ఆక్రమించాయి. ఒక్కసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువులు పెరగడంతో పర్యావరణంపై భారం పెరుగుతున్న వేళ.. మట్టి పాత్రల వినియోగం పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మట్టి సహజంగా లభించే పదార్థం కావడం, మట్టి పాత్రలు వినియోగం తర్వాత తిరిగి ప్రకృతిలో కలిసిపోయే అవకాశం ఉండటం వాటికి మరో ప్రత్యేకత.

### యువత దూరమవుతున్న వృత్తి

కుమ్మరి కుటుంబాల్లో మరో పెద్ద సమస్య యువత ఈ వృత్తిని కొనసాగించడానికి ఆసక్తి చూపకపోవడం. రోజంతా శ్రమించినా ఆశించిన ఆదాయం రాకపోవడం, మార్కెట్ సౌకర్యాలు లేకపోవడం, ఆధునిక వృత్తులతో పోలిస్తే సామాజికంగా, ఆర్థికంగా అవకాశాలు తక్కువగా కనిపించడం వంటి కారణాలతో చాలామంది యువకులు ఇతర ఉపాధి మార్గాల వైపు వెళ్తున్నారు. తండ్రి చక్రం తిప్పుతుంటే కొడుకు మరో పని కోసం పట్టణానికి వెళ్లే పరిస్థితి అనేక కుటుంబాల్లో కనిపిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే నైపుణ్యం కలిగిన సంప్రదాయ కళాకారుల సంఖ్య మరింత తగ్గిపోయే ప్రమాదం ఉంది.

### మట్టి కళకు మార్కెట్ దొరికితే.. బతుకు మారుతుంది

కుమ్మరి వృత్తిని కేవలం సంప్రదాయ వృత్తిగా కాకుండా ఒక చిన్న పరిశ్రమగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. సాధారణ కుండలతో పాటు ఆధునిక డిజైన్లతో నీటి కుండలు, మొక్కల కుండీలు, అలంకరణ వస్తువులు, వంట పాత్రలు, దీపాలు, పూజా సామగ్రి, హోటళ్లు--రెస్టారెంట్లకు అవసరమైన ప్రత్యేక మట్టి పాత్రలు తయారు చేస్తే మార్కెట్‌ను విస్తరించవచ్చు. ఇందుకు శిక్షణ, ఆధునిక డిజైన్ పరిజ్ఞానం, నాణ్యమైన మట్టి అందుబాటు, విద్యుత్ లేదా మెరుగైన బట్టీలు, రవాణా సౌకర్యం, మార్కెటింగ్ సహాయం, ఆన్‌లైన్ విక్రయాలపై అవగాహన అవసరం. ప్రభుత్వ పథకాలు ఉన్నప్పటికీ అవి ప్రతి కుమ్మరి కుటుంబానికి సులభంగా అందేలా చేయాల్సిన అవసరం ఉంది.

### గ్రామీణ జాతరలు.. పండుగలు.. మరో ఆశ

బతుకమ్మ, బొడ్డెమ్మ, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో మట్టి వస్తువులకు డిమాండ్ ఉంటుంది. గ్రామీణ జాతరలు, శిల్ప మేళాలు, స్వయం సహాయక సంఘాల మార్కెట్లు, ప్రభుత్వ ప్రదర్శనల్లో కుమ్మరి కళాకారులకు ప్రత్యేక స్థానం కల్పిస్తే వారికి ప్రత్యక్ష మార్కెట్ లభిస్తుంది. మధ్యవర్తులపై ఆధారపడకుండా కళాకారులే నేరుగా వినియోగదారులకు తమ ఉత్పత్తులను విక్రయించే అవకాశం కల్పిస్తే వారికి వచ్చే ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

### మట్టిని వదిలేస్తే.. మూలాలను మరిచినట్టే

కుమ్మరి కుండ అనేది కేవలం ఒక పాత్ర కాదు. అది మన గ్రామీణ సంస్కృతికి గుర్తు. మన పూర్వీకుల జీవన విధానానికి ప్రతీక. మట్టితో మనిషికి ఉన్న అనుబంధానికి నిదర్శనం. ఒకప్పుడు ప్రతి ఇంటి వంటింట్లో కనిపించిన మట్టి పాత్రలు నేడు అలంకరణ వస్తువులుగా మారిపోవడం కాలం తెచ్చిన మార్పుకు నిదర్శనం. ఆధునిక జీవన విధానాన్ని తిరస్కరించాల్సిన అవసరం లేదు. కానీ ఆధునికత పేరుతో మన సంప్రదాయ వృత్తులు, కళలు పూర్తిగా కనుమరుగు కాకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉంది.

### కుండను కొనడం.. ఒక కుటుంబానికి చేయూతనివ్వడం

ఇంట్లో అవసరమైనప్పుడు మట్టి కుండ కొనడం చిన్న విషయం అనిపించవచ్చు. కానీ ఆ కుండ వెనుక ఒక కుటుంబం శ్రమ ఉంటుంది. మట్టిని చేతులతో పిసికి, చక్రంపై ఆకారం ఇచ్చి, ఎండలో ఆరబెట్టి, బట్టీలో కాల్చి తయారు చేసిన ప్రతి వస్తువు వెనుక గంటల తరబడి కష్టపడిన కళాకారుడి జీవితం ఉంటుంది. అందుకే కుమ్మరి తయారు చేసిన మట్టి వస్తువును కొనడం అంటే కేవలం ఒక వస్తువు కొనడం కాదు.. ఒక సంప్రదాయాన్ని బతికించడం. ఒక కుటుంబానికి ఉపాధి కల్పించడం. ఒక కళను తరువాతి తరానికి అందించడం.

### మట్టి వాసన పోకూడదు.. కుమ్మరి చక్రం ఆగకూడదు

కాలం మారినా మట్టికి మన జీవితంలో ఉన్న బంధం తెగిపోకూడదు. కుమ్మరి చక్రం తిరుగుతూ ఉండాలి. ఆ చక్రంతో పాటు ఒక కుటుంబం బతుకు తిరగాలి. తరతరాలుగా వస్తున్న ఈ కళ మరుగునపడకుండా కొత్త మార్కెట్, కొత్త అవకాశాలు, కొత్త ఆదాయ మార్గాలు కల్పించాలి. మట్టి కుండలో నీళ్లు చల్లబడటమే కాదు.. దాని వెనుక ఒక కుటుంబం చెమట కూడా దాగి ఉంటుంది. ఆ చెమటకు విలువ ఇచ్చినప్పుడే కుమ్మరి కళకు నిజమైన గౌరవం లభిస్తుంది.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. PRGI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com